అండర్-15 చాంప్ తన్వి

ఫైనల్‌లో ఘనవిజయం

చెంగ్డూ (చైనా): ఆసియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తన్వి పత్రి చాంపియన్‌గా నిలిచింది. చైనాలోని చెంగ్డూ వేదికగా ఆదివారం జరిగిన అండర్-15 బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో 13 ఏండ్ల తన్వి.. 22-20, 21-11తో హుయెన్ ఎంగ్వుయెన్ (వియత్నాం)ను చిత్తు చేసి స్వర్ణం సాధించింది. 34 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో 11-17తో వెనుకబడ్డ తన్వి.. ప్రత్యర్థి చేసిన తప్పులను రెండుచేతులా ఒడిసిపట్టుకుని ఒక్కో పాయింట్ దక్కించుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో గేమ్‌లోనూ అదే ఊపుతో ఆడి గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆడిన 5 మ్యాచ్‌లలోనూ తన్వి ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా పూర్తిస్థాయి ఆధిపత్యం చెలాయించడం గమనార్హం. ఈ విజయంతో ఒడిషాకు చెందిన తన్వి.. అండర్ -15 బాలికల చాంపియన్‌షిప్ గెలిచిన మూడో భారత షట్లర్‌గా నిలిచింది. గతంలో సమియ ఇమాద్, తస్నిమ్ మిర్ ఈ ఘనత సాధించారు. ఈ టోర్నీ అండర్-17 బాలుర చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అబ్బాయి జ్ఞానదత్తు కాంస్యం గెలుచుకున్న విషయం విదితమే.

నేటి నుంచే యూఎస్ ఓపెన్

సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీకి సర్వం సిద్ధం

న్యూయార్క్: టెన్నిస్ క్యాలెండర్‌లో ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి సోమవారం నుంచి తెరలేవబోతోంది. నేటి నుంచి పురుషుల, మహిళల సింగిల్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. డిఫెండింగ్ చాంపియన్లు నొవాక్ జొకోవిచ్ (పురుషుల), కోకో గాఫ్ (మహిళల) తమ టైటిల్స్‌ను నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగుతున్నారు. పురుషుల కేటగిరీలో కార్లోస్ అల్కారజ్, జన్నిక్ సిన్నర్, డేనియల్ మెద్వెదెవ్, ఆండ్రీ రుబ్లెవ్, అలగ్జాండర్ జ్వెరెవ్, ఫ్రాన్సెస్ టియాఫో, టేలర్ ఫ్రిట్జ్ వంటి స్టార్లు టైటిల్ వేటలో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ ఇగా స్వియాటెక్, అరీనా సబలెంక, జాస్మిన్ పలోని, ఎలీనా రిబాకినా, జలెనా ఒస్టపెంకొ, యువ సంచలనం మిర్రా అండ్రీవాతో పాటు పారిస్ ఒలింపిక్ స్వర్ణ విజేత కిన్వెన్ జెంగ్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గతేడాది ఇక్కడే తన కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి 25వ టైటిల్ కోసం ఏడాదిగా వేచి చూస్తున్న జొకోవిచ్ మరోసారి తనకు అచ్చొచ్చిన యూఎస్ ఓపెన్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ఇటీవలే ముగిసిన విశ్వక్రీడలలో స్వర్ణం సాధించడం జొకోలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

అఖిల్‌కు రెండో స్థానం

చెన్నై: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో తొలిరోజు నిరాశపరిచిన హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రెండోరోజు సత్తా చాటింది. ఈ పోటీలలో భాగంగా చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఆదివారం జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) మొదటి రౌండ్ రెండో రేసులో హైదరాబాద్ రేసర్ అఖిల్ రవీంద్ర రెండో స్థానంతో రన్నరప్‌గా నిలిచాడు. 27 నిమిషాల 19.810 సెకన్లలో రేసును పూర్తిచేసిన అతడు తృటిలో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. శ్రాచి బెంగాల్ టైగర్స్ డ్రైవర్ అలీస్టర్ యూంగ్.. 27 నిమిషాల 15.266 సెకన్లలో రేసును పూర్తిచేశాడు. గోవా ఏసెస్ జేఏ రేసింగ్ జట్టు డ్రైవర్ గాబ్రియెల్లా జిల్కోవా మూడో స్థానంలో నిలిచింది.

చెన్నై 'కమాల్'

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)-2024లో ఆతిథ్య చెన్నై లయన్స్ బోణీ కొట్టింది. ఆదివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో 8-7తో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ఢిల్లీకి ఇది వరుసగా రెండో పరాభవం. పురుషుల సింగిల్స్‌లో చెన్నై లయన్స్ ప్యాడ్లర్ ఆచంట శరత్ కమాల్ 2-1తో ఆండ్రీస్ లెవంకొను ఓడించి తన జట్టుకు తొలి విజయాన్ని అందించాడు. ఆ తర్వాత సకురా మొరి, జుసెల్ రొలండ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో శరత్, సకురా విజయాలు సాధించారు. బైస్య 0-3తో దియా చిటాలె చేతిలో ఓడిపోయింది.

వారెవ్వా బంగ్లా

పాకిస్థాన్‌పై తొలి టెస్టు గెలుపు • రావల్పిండిలో చారిత్రాత్మక విజయం

మెహిది హసన్, షకిబ్ స్పిన్ మాయాజాలం • ఆఖరి రోజు తడబడ్డ పాక్

'రికార్డులనేవి ఉన్నది బ్రేక్ చేయడానికే'.. పాకిస్థాన్‌తో రావల్పిండి వేదికగా జరిగిన తొలి టెస్టుకు ముందు పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో బంగ్లాదేశ్ సారథి నజ్ముల్ హోసెన్ శాంతో చెప్పిన మాటలవి! కట్ చేస్తే సరిగ్గా ఐదు రోజుల తర్వాత అతడి మాటలే నిజమయ్యాయి. ఈ టెస్టుకు ముందు పాకిస్థాన్‌తో ఆడిన 13 టెస్టులకు గాను 12 మ్యాచ్‌ల లోనూ బంగ్లాకు పరాభవమే. కానీ రావల్పిండిలో పర్యాటక జట్టు అద్భుతమే చేసింది. ఐదో రోజు ఆటలో క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో అనిశ్చితికి మారుపేరైన పాక్‌ను బోల్తా కొట్టించి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. నాలుగు రోజులూ బ్యాటర్లకు అనుకూలించిన రావల్పిండి పిచ్ ఐదో రోజు అనూహ్యంగా 'మలుపు' తీసుకోవడంతో మ్యాచ్ పాక్ చేతుల నుంచి చేజారింది.

రావల్పిండి: పాకిస్థాన్ పర్యటనలో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. గడిచిన రెండు నెలలుగా దేశంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడి 'అధికార మార్పు' ఆందోళనలతో అతలాకుతలమైన అక్కడి ప్రజలకు కాస్త స్వాంతన చేకూర్చుతూ ఆ దేశ క్రికెట్ జట్టు పాకిస్థాన్‌పై చారిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. రావల్పిండి వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టును 10 వికెట్ల తేడాతో గెలుచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ తమ ఎదుట ఉంచిన 117 పరుగుల ఆధిక్యాన్ని తగ్గించి పర్యాటక జట్టుకు లక్ష్యాన్ని నిర్దేశించే క్రమంలో షాన్ మసూద్ సారథ్యంలోని పాక్.. 55.5 ఓవర్లలో 146 పరుగులకే చేతులెత్తేసింది. బంగ్లా స్పిన్ ద్వయం మెహిది హసన్ మిరాజ్ (4/21), షకిబ్ అల్ హసన్ (3/44) స్పిన్ మాయాజాలానికి పాక్ స్టార్ బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం పాక్ నిర్దేశించిన 30 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా ఓపెనర్లు వికెట్ నష్టపోకుండా పూర్తిచేసి ఆ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. బంగ్లా తరఫున తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం చేసిన ముష్ఫీకర్ రహీమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 23 ఏండ్లుగా పాక్‌తో టెస్టులు ఆడుతున్న బంగ్లాకు ఇదే తొలి విజయం.

స్పిన్ తంత్రానికి కుదేలు..

23/1. ఐదో రోజు ఆట ప్రారంభానికి ముందు పాక్ స్కోరు అది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 94 పరుగులు వెనుకబడ్డ పాక్ అనూహ్యంగా తడబడింది. కెప్టెన్ మసూద్ (14)ను రెండో ఓవర్‌కే హసన్ మహ్మద్ ఔట్ చేసి పాక్ పతనానికి దారులు వేశాడు. డ్రింక్స్ విరామం తర్వాత నహిద్ రాణా బౌలింగ్‌లో బాబర్ ఆజమ్ (22), ఆ మరుసటి ఓవర్లోనే షకిబ్ బౌలింగ్‌లో సౌద్ షకీల్ (0) స్టంపౌట్ అవడంతో పాక్ కష్టాలు రెట్టింపయ్యాయి. అదే ఊపులో షకిబ్.. షఫీక్ (37)ను పెవిలియన్‌కు పంపాడు. ఇక లంచ్‌కు రెండు ఓవర్ల ముందు మిరాజ్.. అఘా సల్మాన్ (0)నూ ఔట్ చేయడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత మిరాజ్.. షహీన్ అఫ్రిది (2)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నసీమ్ షా (3)ను షకిబ్ ఔట్ చేశాడు. ఈ క్రమంలో పాక్ వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ (51) ఆ జట్టు వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. కానీ మిరాజ్ మరోసారి మాయ చేసి అతడిని క్లీన్ బౌల్డ్ చేయడంతో ఆ జట్టు ఆశలు అడుగంటాయి. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జకీర్ హసన్ (15 నాటౌట్), ఇస్లాం (9 నాటౌట్) తడబాటు లేకుండా లాంఛనాన్ని పూర్తిచేశారు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 448/6 డిక్లేర్ (రిజ్వాన్ 171, షకీల్ 141), **బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** 565 ఆలౌట్ (ముష్ఫీకర్ 191, మిరాజ్ 77) **పాక్ రెండో ఇన్నింగ్స్:** 146 ఆలౌట్ (రిజ్వాన్ 51, మిరాజ్ 4/21, షకిబ్ 3/44) **బంగ్లా రెండో ఇన్నింగ్స్ :** 30/0 (జకీర్ 15 నాటౌట్)

1 పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు (14 మ్యాచ్‌లలో) విజయం. పాక్‌ను స్వదేశం (టెస్టులు)లో 10 వికెట్ల తేడాతో ఓడించిన తొలి జట్టు బంగ్లా.

భువనగిరిలో అంతర్జాతీయ టెన్నిస్ క్రీడలు షురూ

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూజెమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజ నర్సింహారావ్ మెమోరియల్ అంతర్జాతీయ జూనియర్స్ జె 6-అండర్-18 టెన్నిస్ క్రీడలు ఆదివారం అట్టహాసంగా మొదలయ్యాయి. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో యూఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల నుంచి 17 మందికి పైగా క్రీడాకారులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో 8 కోర్టులను ఏర్పాటు చేయడం అభినందనీయమని కుంభం అన్నారు.

స్పోర్ట్స్ విలేజ్‌గా గచ్చిబౌలి

మారథాన్ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): రాబోయే రోజుల్లో గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, అందుకు అనుగుణంగా అన్ని వసతులను కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నదని, తెలంగాణ యువతను క్రీడలవైపు మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గచ్చిబౌలిని స్పోర్ట్స్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని వచ్చే అకడమిక్ ఇయర్‌లో ప్రారంభించబోతున్నామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి కోచ్‌లను తీసుకొచ్చి క్రీడాకారులకు శిక్షణ అందిస్తామని, ఒలింపిక్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మన స్టేడియాలని తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

లవ్లీ హస్బెండ్ ప్రేమాట

వెంకటేశ్ ఫ్యామిలీ సినిమా చేస్తే హిట్ పక్కా. కాస్త విరామం తర్వాత ఆయన లవ్లీ హస్బెండ్‌గా కనిపించనున్నారు. అపజయం ఎరుగని అనిల్ రావిపూడి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో, శిరీష్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం పొల్లాచ్చిలో జరుగుతున్నది. అక్కడి అందమైన ప్రదేశాల్లో వెంకటేశ్, ఐశ్వర్య రాజేష్‌లపై బ్యూటిఫుల్ మెలోడి సాంగ్‌ని దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరిస్తున్నారు. భాస్కరభట్ల రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. భార్యాభర్తల ప్రేమను తెలిపే ఉత్తమమైన పాటల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని, సంగీతం, సాహిత్యంతోపాటు కొరియోగ్రాఫర్ భాను మాస్టర్ లవ్లీ డాన్స్ మూమెంట్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయన భార్యగా ఐశ్వర్య రాజేష్, మాజీ ప్రేయసిగా మీనాక్షి చౌదరి కనిపించనున్నారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి.

భావోద్వేగాల మేళవింపు

నివేతా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న విభిన్నమైన ఫ్యామిలీ డ్రామా '35-చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలు. ఈ సినిమాను సెప్టెంబర్ 6న విడుదల చేయనున్నట్టు ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సినిమా విడుదల కానుంది. 'ఇది ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే సినిమా. ఎంపిక చేసిన కొద్ది మందికి ఈ సినిమాను ప్రదర్శించగా అందరూ పాజిటివ్‌గా స్పందించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో కామెడీ, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో ఉంటాయి.' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: వివేక్ సాగర్, నిర్మాణం: సురేశ్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్ వాల్టెయిర్ ప్రొడక్షన్స్.

టీఎఫ్ఈఎఫ్ కార్యదర్శిగా అమ్మిరాజు కాసుమిల్లి

తెలుగు సినిమా 24 శాఖలకు చెందిన ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు కాసుమల్లి విజయం సాధించారు. ఆదివారం జరిగిన కార్యదర్శి ఎన్నికల్లో అమ్మిరాజు 35 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇంతకు ముందు ఈ పదవిలో దొరై ఉండేవారు. ఇటీవలే జరిగిన మేనేజర్స్ ఎన్నికల్లో దొరై ఓటమిపాలయ్యారు. నిబంధల ప్రకారం ఆయన ఫెడరేషన్ పోస్ట్‌కు అనర్హుడు కావడంతో ఈ పోస్ట్‌కు ఎన్నికలు అనివార్యమయ్యాయని కమిటీ పేర్కొన్నది. ఫెడరేషన్ అధ్యక్షునిగా అనిల్ వల్లభనేని, కోశాధికారిగా సురేశ్ ఇప్పటికే బాధ్యతల్లో ఉండగా, ఇప్పుడు కార్యదర్శిగా అమ్మిరాజు బాధ్యతను స్వీకరించారు. అమ్మిరాజు కార్యదర్శిగా ఎంపిక కావడంపట్ల ఫెడరేషన్ సంతోషం వెలిబుచ్చింది. కార్యదర్శిగా తనను ఎన్నుకున్న సభ్యులకు అమ్మిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్రం

ఏడాదిపాటు నిరవధికంగా

'పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమా ద్వారా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నాను. ఆ ఫీలింగే చెప్పలేని సంతోషాన్నిస్తోంది' అంటూ సంబరపడిపోతున్నది అందాలభామ మాళవిక మోహనన్. ప్రభాస్, మారుతిల 'రాజా సాబ్' సినిమా ద్వారా మాళవిక టాలీవుడ్‌కి పరిచయమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'రాజా సాబ్' సినిమా గురించి, ప్రభాస్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది మాళవిక. 'ప్రభాస్ పెక్యులర్ పర్సన్. సెట్‌లోకి వస్తూనే ఎనర్జీని తెస్తారు. పనిని భారంగా కాకుండా ఎంజాయ్ చేస్తూ చేస్తారు. అసలు పాన్ ఇండియా సూపర్‌స్టార్ అన్న గర్వం ఆయనలో ఏ మాత్రం కనిపించదు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తారు. ఆయన సినిమా ద్వారా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా బ్లాక్‌బాస్టర్ అవుతుంది' అంటూ చెప్పుకొచ్చింది మాళవిక మోహనన్.

సెట్‌లోకి వస్తూనే ఎనర్జీని తెస్తారు

తాజాగా ఈ మలయాళ మందారం.. విక్రమ్ 'తంగలాన్'లో ఆరతి పాత్రలో తళుక్కున మెరిసింది. ప్రేక్షకుల నుంచి కూడా మంచి మార్కులే సొంతం చేసుకుంది.

'కల్కి 2898ఏడీ'తో బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టేశాడు ప్రభాస్. ఓటీటీలో కూడా 'కల్కి' చేస్తున్న హంగామా మామూలుగా లేదు. త్వరలో ప్రభాస్ నుంచి మరిన్ని అద్భుతాలు రానున్నాయి. వాటిల్లో ఒకటి 'స్పిరిట్'. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా విషయంలో ఓ తాజా అప్‌డేట్ వెలుగు చూసింది. 'స్పిరిట్' షూటింగ్‌ని వచ్చే ఏడాది జనవరి నుంచి మొదలుపెట్టనున్నారట సందీప్‌రెడ్డి. ఈ లోపు ప్రభాస్ తన ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటారు. పాన్ ఆసియా లెవల్లో తెరకెక్కనున్న 'స్పిరిట్' షూటింగ్‌ని నిరవధికంగా ఏడాది పాటు ప్లాన్ చేశారట సందీప్‌రెడ్డి. 2026 జనవరిలో సినిమాను విడుదల చేసేందుకు ఆయన కసరత్తులు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటించనున్నారు. త్రిష కథానాయికగా ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. మొత్తానికి సందీప్ సాలిడ్ ప్లానింగ్‌తోనే ఉన్నాడని చెప్పొచ్చు.

సారంగపాణి జాతకం

శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ కలయికలో ఇదివరకే జెంటిల్‌మెన్, సమ్మోహనం వంటి ఎంటర్‌టైనర్స్ వచ్చాయి. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో ప్రియదర్శి కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందుతున్నది. ఈ సినిమాకు 'సారంగపాణి జాతకం' అనే టైటిల్ ఖరారు చేయగా, ఆదివారం ఈ టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేక అతని చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చే పరిపూర్ణ హాస్యరసచిత్రమిది. ఇంద్రగంటి అద్భుతమైన కథ రాసుకున్నారు. సాంకేతికంగా సినిమా ఉన్నతస్థాయిలో ఉంటుంది. 90శాతం చిత్రీకరణ పూర్తయింది. నేటి నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగే షూటింగ్‌లో రెండు పాటలు, మిగతా సన్నివేశాలు చిత్రీకరిస్తాం. దీంతో షూటింగ్ కంప్లీట్ అవుతుంది.' అని శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ 'నమ్మకం మనిషికి బలాన్నిస్తుంది. మూఢనమ్మకం బుద్ధిహీనుడ్ని చేస్తుంది. అలా నవ్వులపాలైన ఓ మధ్యతరగతి మంచి అబ్బాయి కథే మా 'సారంగపాణి జాతకం'. వినోదంతోపాటు భావోద్వేగాలను కూడా ప్రియదర్శి చక్కగా పండించాడు. కుటుంబసమేతంగా చూడాల్సిన సినిమా ఇది' అని పేర్కొన్నారు. రూప కొడువాయూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నరేశ్, తనికెళ్లభరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్.

సెప్టెంబర్ 8న తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ ఎన్నికలు

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ కార్యవర్గం రెండేళ్ల పదవీకాలం పూర్తయినందున, సెప్టెంబర్ 8న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోడానికి ఎన్నికలు నిర్వహించాలని ఛాంబర్ సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ స్థాపించి 14ఏండ్లయింది. వెయ్యిమంది నిర్మాతలతోపాటు 24 శాఖలకు చెందిన 16వేలమంది ఈ ఛాంబర్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే సభ్యులందరికీ ఇన్సూరెన్స్, సభ్యుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాం. సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. ప్రస్తుతం ఉన్న ఛాంబర్ పాలకవర్గ పదవీకాలం పూర్తయింది. కావున ఎన్నికలకు వెళ్తున్నాం. సెప్టెంబర్ 1 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. సెప్టెంబర్ 8న ఎన్నికలు నిర్వహిస్తాం. సభ్యులందరూ తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి.' అని కోరారు.

మార్కండేయుని వేట మొదలైంది

తేజస్ వీరమాచినేని, అక్షయ రోమి జంటగా నటిస్తున్న చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' ఉపశీర్షిక. బన్నీ అశ్వత్ దర్శకుడు. శ్రీధర్ సామా, వెంకట్ గౌడ్ పంజాల కలిసి ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగో ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ నటుడు సుమన్, నిర్మాతలు ప్రతాని రామకృష్ణగౌడ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వైశ్య ప్రముఖులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఇంకా గంగపురం పద్మగౌడ్, నవీన్ మాచర్ల అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 90శాతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిందని, అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయి.

నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది

చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో హీరో నటించిన చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు, కథానాయకుడు చిమటా రమేశ్‌బాబు, కథానాయిక రిషిత ఆదివారం మీడియాతో ముచ్చటించారు. ఇది దర్శకుడిగా, కథానాయకుడిగా తనకు మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని, ఇందులో కథానాయికగా నటించిన రిషితకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని, రెండున్నర గంటలపాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇదని చిమటా రమేశ్‌బాబు తెలిపారు. 'నేను-కీర్తన' సినిమా హీరోయిన్‌గా తన కెరీర్‌కి శుభారంభం ఇస్తుందనే నమ్మకంతో ఉన్నానని కథానాయిక రిషిత చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.